# చున్నీ ఏదే చిన్నీ?

సన్యాసిరావ్ మరీ పెద్ద సన్నాసి కాడు! టెన్త్ పాసై, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పరీక్షల ముందు బాగా చదివేవాళ్ల చదువు చెడగొట్టి, ముఖ్యమైన విషయాలు తెలుసుకుని, ఎలాగో టెన్త్‌క్లాస్ దాటేశాడు. చదువుకోడానికి, ముందు ముందు చాలా వ్యవధి ఉండనే ఉందని కాలేజీలో అల్లరి మొదలెట్టేశాడు. ముఖ్యంగా అమ్మాయిల్ని ఆటపట్టించడమంటే చాలా సరదా! ఇడ్లీకి అల్లప్పచ్చడి నంజుకు తింటున్నంత ఆనందిస్తాడు.

అప్పుడప్పుడే యుక్తవయస్సులోకొస్తున్న కొంతమంది అమ్మాయిలు పంజాబీ డ్రెస్ వేసుకుని వచ్చేవారు కాలేజికి! పంజాబీ డ్రెస్ కొత్త అవడంతో చున్నీలు యిబ్బందికరంగా ఉన్న కొంతమంది చున్నీలు వేసుకునేవారు కాదు. వారిలో ఒక అమాయకురాలిని ఓసారి "చున్నీ ఏది చిన్నీ?" అని ఆటపట్టించాడు.

అస్తమానం యిలా బాధపెడుతూంటే, ఓసారి ఆ ముగ్ధ వాళ్ళ మేనమామని కాలేజికి తీసుకువచ్చింది. "అదిగో మావయ్యా" అని సన్యాసిరావ్‌ని చూపించింది ఉమ.

"సన్యాసిరావ్! ఓసారి యిలా రారా!" అన్నాడు కోపంతో ఉమ మావ.

అతను రాలేదు.

"అరే సన్నాసీ! నిన్నేరా!" అని, మరింత గట్టిగా పిలిచాడు మావయ్య.

"అంత గట్టిగా నలుగురికీ వినపడేటట్లు అరుస్తారెందుకు సార్! 'సన్నాసీ' అని మెల్లిగా పిలిచినా నన్నే పిలుస్తున్నారని అర్థం చేసుకోగలను"

"నా మేనకోడలిని చున్నీ ఏదంటూ ఏడిపిస్తున్నావట?"

పెద్దగొడవేదో మెడకి చుట్టుకుంటున్నట్లు అర్థమయింది సన్యాసిరావ్‌కి.

ఇంతలో "నువ్వెప్పుడైనా అరటిపండు తిన్నావా?" అన్నాడు ఉమ మావయ్య.

'తిన్నానంటే ఏమంటాడో, తినలేదంటే ఏమంటాడో' అని భయపడుతూ, తిన్నానని ఒప్పుకున్నాడు.

"పండు తొక్క నువ్వే తీసుకుతిన్నావా, ఎవరైనా ఒలిచి యిస్తే తిన్నావా?"

చున్నీ మెడకు చుట్టిలాగినట్లూ, ఊపిరి స్తంభించినట్లూ అయింది సన్యాసికి.

ఎందుకైనా మంచిదని, వాళ్ళమ్మని మధ్యలోకి తీసుకొస్తే జాలిపడి ఏమనడని. "మా అమ్మ ఒలిస్తే తిన్నాను" అన్నాడు.

"అంటే అరటిపండు తొక్క కూడా తీసుకు తినలేని సన్నాసివి అన్నమాట! నే

చెపుతా విను" అంటూ గీతోపదేశం చేస్తున్నట్లు చెప్పాడాయన. "అని తొక్కల్లోకీ అరటిపండు తొక్క తియ్యడం చాలా సులువు"

అసలు ఈ అరటిపండు తొక్కకీ, చున్నీకి ఏం సంబంధమో అర్థం కాలేదు సన్యాసిరావ్‌కి.

ఇంతలో "ఈసారి కనక మా మేనకోడలి చున్నీ గురించి ఏమైనా వాగితే, నీ చర్మం అరటిపండు తొక్క తీసినంత అవలీలగా ఒలిచి, నీ చర్మంతో ఓ చున్నీ చేయించి, ఆమెకి కానుకగా యిస్తాను" అన్నాడు మావయ్య.

మనిషి చర్మం చున్నీలు చెయ్యవచ్చన్న కొత్త విషయం కాలేజీలో తెలుసుకున్నందుకు సంతోషిస్తూ "చిత్తం... నన్ను క్షమించండి" అన్నాడు సన్యాసిరావ్. ఆ తర్వాత సవినయంగా సెలవు తీసుకు వెళ్ళిపోయాడు.

సన్యాసిరావ్ చర్మ రక్షణకే అన్నట్లు అతని నాన్నగారికి బెజవాడ నుంచి అనంతపురం బదిలీ అయిపోయింది.

అంతో యింతో చదివి అనంతపురంలో పట్టభద్రుడయ్యాడు సన్యాసిరావ్. పెళ్ళీడు వచ్చింది. బెజవాడ నుంచి ఓ సంబంధం వచ్చింది. నాడు చున్నీ లేకుండా తిరిగిన ఉమే.. వధువు! సన్యాసిరావ్... వరుడు.

పెళ్లి చూపుల్లో సన్యాసిరావ్‌ని చూసిన ఉమకి, అతను ఆ పాత సన్నాసేమోనన్న అనుమానం వచ్చింది. కానీ 'ఆ! అతను చాలా నల్లగా ఉండేవాడు. ఇతను కొంచెం తెల్లగా ఉన్నాడు. ఇతను అతను కాదులే' అనుకుంది.

సంబంధాలు కుదరనందుకు పళ్లరసాలు పట్టించడంతో, తెల్లబడ్డాడు సన్నాసి.

ఓ కీర్తన పాడమన్నారు ఆమెను. ఓ కీర్తన అందుకుంది.

సన్యాసిరావ్ తండ్రి "చాలా బాగుంది. మా వాడి పేరు సన్యాసిరావ్. నువ్వు పాడింది కూడా శుద్ధ సన్యాసిరాగం. ఘటన అంటే యిదే" అన్నాడు.

"ఉద్యోగం పెద్దదికాకపోయినా ఆస్తి చాలా ఉంది! పెళ్లయితే ఇంకొంచెం తెల్లబడతాడులే" అని ఉమని ఒప్పించి, ఈ సన్యాసి సంబంధమే ఖాయం చేశారు. అలా పెళ్లయిపోయింది.

పెళ్లయిన కొత్తలో చీరలు కట్టుకుని తిరిగేది ఉమ.

"నీకు పంజాబీ డ్రెస్‌లు, బాగుంటాయ్, వేసుకో" అని ఉత్సాహపరిచాడు సన్యాసి.

"సరే" అని ఒప్పుకొంది.

ఓసారి వంటచేస్తూ, చున్నీ కిటికీ తలుపుకి తగిలించిందామె.

సన్యాసికి ఏం పనిలేక, వంటింట్లోకి వచ్చాడు.

"సారీ! ఇందాక చున్నీమీద మంచినీళ్లు పడ్డాయి. అందుకని తీసి పక్కన పెట్టాను. 'సిగ్గులేకుండా చున్నీ లేకుండా ఉందేమిట'ని అనుకోకండి"

"అదేమిటి ఉమా! నువ్వు చున్నీ లేకుండానే బాగున్నావ్‌గా"

ఆ రాత్రి నిద్రలో 'చిన్నీ! ఏది చున్నీ?" అంటూ కలవరించాడు పిచ్చి సన్యాసి.

'అయితే అప్పటి సన్యాసే ఇప్పుడు నా మొగుడు సన్యాసి' అనుకుంది ఉమ. అసలు విషయం తేలుద్దామని మర్నాడు పొద్దున్నే అంది. "నేను చున్నీలేకుండా బాగుంటానా? చున్నీతో బాగుంటానా? అని.

వెంటనే సన్యాసి "నేను కాలేజీలో చదువుకున్న రోజులు గుర్తుకు తెస్తున్నావ్" అన్నాడు, తనేదో గొప్పగా చదివినట్లు.

"నా చున్నీకీ మీ చదువుకీ ఏం సంబంధం?"

"ఆ పాయింట్‌కే వస్తున్నా. నేను ఇంటర్‌లో కొత్తగా చేరిన రోజులవి. కొంత మంది అమ్మాయిలు పంజాబీ డ్రెస్‌ని చున్నీ లేకుండా వేసుకునేవారు. ఓ అమ్మాయిని, 'చున్నీ ఏదే చిన్నీ?' అని ఏడిపించేవాణ్ని. నేనిలా అన్నప్పుడల్లా ఆ అమ్మాయి వలవలా ఏడ్చేసేది"

"అయితే ఆ సన్యాసివి నువ్వేనన్నమాట" అనుకుంటూ "ఇంతకీ ఆ అమ్మాయి పేరేమిటండీ?" అంది.

"పేరు తెలీదు! అప్పుడప్పుడే కాలేజీలో చేరాను. ఇంకా కొన్నాళ్లుపోతే తెలుసుకునే వాడిని. ఈలోపునే మా నాన్నగారికి బెజవాడ నుండి అనంతపూర్ బదిలీ అయి వెళ్లిపోయాం"

"అంటే ఇంకా కొన్నాళ్లుపోతే... పాఠాలు తెలుసుకోకుండా, ఆడపిల్లల పేర్లు తెసుకునేవాడివన్నమాట! ఎంత సన్యాసివి దొరికావు' అనుకుంది ఉమ. "ఈ అల్లరి అక్కడ చేశారు కనుక సరిపోయింది. ఇదే మరోచోట అయితే చర్మం ఒలిచి చున్నీ చేసేవారు" అంది.

హఠాత్తుగా ఈ 'చర్మం ఒలవడం' ముచ్చట విన్న సన్యాసిరావ్‌కి ముచ్చెమటలు పోశాయ్. 'చర్మం ఒలిచి చున్నీ చేయిస్తాన'న్న ఆ పిల్ల మేనమావ గుర్తొచ్చాడు. "నీకెవరైనా మేనమావలున్నారా?" అడిగాడు.

"ఒక మేనమావ ఉన్నాడు. అమెరికాలో స్థిరపడిపోయాడు. పాపం! రెండు చేతులూ యాక్సిడెంట్‌లో విరిగిపోయాయ్. అందుకే మన పెళ్లికి రాలేకపోయాడు"

"వెరీ సారీ" అని పైకి అంటూనే... 'ఒక వేళ ఇండియాకొచ్చినా, తన చర్మం ఒలవలేడ'ని సంతోషించాడు పిచ్చి సన్యాసి!

(విపుల మే 2011)